www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 28 సెప్టెంబరు 2023 | 5 | ఏలూరు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 14 మంది తల సేమియా వ్యాధి చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు అనేకమంది ప్రజలు రకరకాల రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, వారందరూ కూడా రక్తమార్పిడిని చేయించుకుంటున్నారంటే దానికి ప్రధాన కారణం రక్తదాతల సహకారమేనన్నారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి జిల్లా మానవత విద్యా కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజనం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.విన్సెంట్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, ఆలపాటి నాగేశ్వరరావు, బిఆర్‌సిహెచ్.నారాయణ, కడియాల కృష్ణారావు, రేపూరి శివప్రసాద్ పాల్గొన్నారు.

'అసైన్డ్' హస్తగతమే..!

- అసైన్డ్‌చట్ట సవరణతో పేదలకు తీరని అన్యాయం
- భూములు పొంది 20 ఏళ్లు దాటితే యాజమాన్య హక్కు
- రెండు జిల్లాల్లో లక్ష ఎకరాలకుపైగా అసైన్డ్ భూములు
- సగానికిపైగా అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లోనే
- పేదల చేతుల్లోని కొద్ది భూములూ ఇక పెద్దల పరమే

దోసపాడు అసైన్డ్‌భూములపై పోరాటం చేస్తున్న దళితులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో చేసిన చట్టంతో పేదలకు తీరని అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే వేలాది ఎకరాల అసైన్డ్ భూములు బడాబాబుల చేతుల్లో ఉండగా ఇక పేదల వద్ద ఉన్న కొద్దిపాటి భూములు సైతం పెద్దల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. అసైన్డ్‌చట్టంలో చేసిన మార్పులతో పేదల చేతుల్లో భూమి అనేది లేకుండాపోయే ప్రమాదం నెలకొంది. భవిష్యత్తులో పేదలకు భూపంపిణీ అనేది లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగానే అసైన్డ్ చట్టం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 70 వేల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 వేల ఎకరాల వరకూ అసైన్డ్‌భూములు ఉన్నట్లు ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలోని చింతలపూడి, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, దెందులూరు, పెదవేగి, ఆగిరిపల్లి, ముసునూరు, కలిదిండి వంటి మండలాల్లో పెద్దఎత్తున అసైన్డ్ భూములు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో కాళ్ల, భీమవరంతోపాటు పలు మండలాల్లో 40 వేల ఎకరాల వరకూ అసైన్డ్ భూములు ఉన్నాయి. సగానికిపైగా అసైన్డ్ భూములన్నీ బడాబాబుల ఆక్రమణలోనే ఉన్నాయి. పేదలకు పంచిన భూములు సైతం అక్రమ పద్ధతిలో బడాబాబులు లాగేసుకుని అనుభవిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తమ అమాయకత్వంతో గతంలో తమ భూములను కోల్పోయిన పేదలు ఇప్పుడు తమ భూముల ఇప్పించాలని పోరాటం చేస్తున్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి కొనుగోళ్లు, అమ్మకాలు అనేవి నిబంధనల ప్రకారం నిషిద్ధం. చట్టంలో ఉన్న ఈ నిబంధనే పేదలకు ఇప్పటి వరకూ రక్షణ కవచంగా ఉంది. ఇదే తమ భూముల పైన పేదలు పోరాటం చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. దోసపాడులో దళితులకిచ్చిన వంద ఎకరాలకుపైగా అసైన్డ్ భూమి బడాబాబులు సొంతం చేసుకుని అనుభవిస్తున్నారు. దీనిపై గడిచిన రెండేళ్లుగా పేదలు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. టి.నరసాపురం, చింతలపూడి వంటి అనేక మండలాల్లో భూపోరాటాలు కొనసాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలంలోని 74 ఎకరాలకు సంబంధించి పోరాటం సాగుతోంది. ఇలా అనేక ప్రాంతాల్లో తమ భూముల కోసం పేదలు రోడ్డెక్కి పోరాటం చేస్తున్న పరిస్థితి ఉంది.

చట్టం మార్పుతో భూములన్నీ పెద్దల చేతుల్లోకే

అసైన్డ్ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం మార్పు చేసింది. అసైన్డ్ భూమి పొంది 20 ఏళ్లు దాటిన వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తూ చట్టం చేసింది. ఇంటిస్థలం అయితే పదేళ్ల దాటితే యాజమాన్యపు హక్కులు పొందుతారని పేర్కొన్నారు. ఇది పేదలకు పెనుశాపంగా మారనుంది. ప్రస్తుతం పెద్దల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములన్నీ చట్టబద్ధంగా పెద్దల పరం కానున్నాయి. అమాయక పేదల నుంచి లాక్కుని అనుభవిస్తున్న బడాబాబులకు భూములు హస్తగతమవుతాయి. ఆక్రమణ అనుభవిస్తున్న అసైన్డ్ భూములన్నీ బడాబాబులకు సొంతం కానున్నాయి. అంతేకాకుండా భవిష్యత్తులో పేదలకు భూపంపిణీ అనేది ఇక ఉండని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పేదల చేతుల్లో ఉన్న కొద్దిపాటి భూములను బడాబాబులు ఎంతోకొంత చేతిలో పెట్టి దౌర్జన్యంగానే సొంతం చేసుకునే పరిస్థితి ఏర్పడనుంది. అసైన్డ్ చట్టం మార్పుతో మళ్లీ భూమి మొత్తం బడాబాబుల చేతుల్లోకి చేరిపోనుంది. పేదలకు సెంటుభూమి లేకుండాపోనుంది. ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్‌చట్టంతో పేదలు తీవ్రంగా నష్టపోనుండటంతో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఛార్జీలు తగ్గించకుంటే మరో విద్యుత్ ఉద్యమమే

కలెక్టరేట్ వద్ద వామపక్షాల ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

కలెక్టరేట్ ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించకపోతే రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చెప్పిన విధంగా విద్యుత్ సంస్కరణలను చేపడుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రయత్నిస్తుందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు అదానీ కంపెనీ తయారు చేసిందని, స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చును వినియోగదారుల నుండే ప్రభుత్వం వసూలుచేయబోతుందన్నారు. 2014 నుండి ఇప్పటివరకూ విద్యుత్ సంస్థలకు వచ్చిన కరెంట్ లోటును కూడా కరెంట్ బిల్లులో కలిపి అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పూర్వం సాధారణ పేద కుటుంబాలకు రూ.200 కరెంట్ బిల్లు వచ్చేదని ఇప్పుడు రూ.వెయ్యి పైబడి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు భరించలేనంతగా కరెంటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టిడిపి ప్రభుత్వం ఇదే విధంగా విద్యుత్ ఛార్జీలు పెంచితే వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యమాన్ని నడిపాయని గుర్తు చేశారు. ఆ ఉద్యమం దెబ్బకి 2004లో తెలుగుదేశం చిత్తుగా ఓడిపోయిందని, ఆ తరువాత రాష్ట్రంలో ఇప్పటి వరకూ ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచలేదన్నారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం కేంద్రంలో బిజెపి షరతులకు తలవంచి కరెంటు ఛార్జీలు పెంచుతుందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణ చైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ అదనపు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పి.ఆదిశేషు, నగర నాయకులు సాయిబాబు, జగన్నాధరావు, గోపి, సిపిఐ నాయకులు పి.కన్నబాబు, వరప్రసాద్, సుధారాణి, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, వామపక్ష, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు తక్షణ పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'జగనన్నకు చెబుదాం' స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వర ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజలను అర్జీలను అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. సుమారు 124 వినతులు ప్రజల నుంచి వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రజాసమస్యలను నిర్దేశించిన గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ స్పందన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. అర్జీలను కూడా నాణ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణం చేపట్టాలని టిడిపి నాయకులు అర్జీని అందజేశారు. జంగారెడ్డిగూడెంలోని కాలేజి గ్రౌండ్ ఆక్రమణకు గురికాకుండా పూర్తిసర్వే చేసి కాలేజీకి అప్పగించాలని స్థానిక ప్రజలు అర్జీని అందించారు. జంగారెడ్డిగూడెం శ్రీరామపురం గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వర్లు 125 మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన కె.వెంకటరమణ తమకు వేగవరంలో ఉన్న భూమి పక్కన ప్రభుత్వ పుంత ఉందని, దాన్ని కొంతమంది ఆక్రమించుకోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం స్పందించి ఆక్రమణలను తొలగించాలని అర్జీ అందజేశారు. పట్టణంలోని కంటి ఆసుపత్రిలో తమకు కంటి ఆపరేషన్ చేయకుండా చేశామని సొమ్ములు కూడా తమ పేరున డ్రా చేసుకున్నారని దీనిపై విచారణచేసి తనకు న్యాయం చేయాలని ఎ.ఫ్రాన్సిస్ అర్జీని అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి భాస్కర్‌రావు, ఆర్‌డిఒ ఝాన్సీరాణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ రాము, డిజిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణ, మైనారిటీ సంక్షేమ అధికారి కృపావరం, మునిసిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, స్థానిక తహశీల్దార్ స్లీవ జోజి, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్ల బ్యాడ్జీలతో అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

చలో విజయవాడ నిరసన కార్యక్రమానికి హాజరైన అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం నూజివీడు సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు ఆదిలక్ష్మి, ఎఐటియుసి నాయకులు క్రిస్టియన్ అమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు పాల్గొన్నారు. అంగన్‌వాడీల అరెస్టును వీరు ఖండించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోండి : కెవిపిఎస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెంలో దళితులు నివాసం ఉంటున్న ప్రభుత్వ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మైసన్నగూడెంలో సర్వే నెంబర్ 120లో 28 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి ఉందని, ఈ భూమిలోని 56 సంవత్సరాలుగా ఉంద్రాజవరపు బంగారయ్య, వీరయ్య, సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ఆధిపత్య కులాల వారు కక్షసాధింపు చేస్తూ ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. వారిపై దర్యాప్తు జరిపి దళితుల భూమిని దళితులకు ఇవ్వాలని కోరారు. దళితులపై దాడులే కాకుండా దళితుల భూములు లాక్కోవడం సిగ్గుచేటన్నారు. దళితులు సాగు చేస్తున్న భూమిని ఇళ్ల స్థలాలకు ఇవ్వడం దళిత అధికారులను వేధించడం దారుణ మన్నారు. రెవెన్యూ అధికారులు మైసన్నగూడెంలో జరుగుతున్న భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌లపైన దర్యాప్తు జరిపించి దళిత ప్రజలకు న్యాయం చేయాలని ఫ్రాన్సిస్ కోరారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బారావు, నాని పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిందని, ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో ఉన్న హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన విద్యావిధానం రద్దు చేయాలని, నియోజవర్గస్థాయిలో డిగ్రీ కాలేజీ, జిల్లాస్థాయిలో పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్లతో చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చామన్నారు. దీనికి నంద్యాల, విజయనగరం, కడప జిల్లాల్లో నాయకులను ముందస్తు అరెస్టులు చేసి కేసు పెట్టడాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మాట్లాడే స్వేచ్ఛ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న చలో విజయవాడకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

విద్యార్థులకు మెరుగైన వసతులు

జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ విజయకృష్ణ

టి.నరసాపురం: జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, సురక్షిత తాగునీటిని అందించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, అక్కడి వసతులను, వంటకాలను పరిశీలించారు. తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు ఇంటి నుంచి తాగునీటిని తెచ్చుకోవడం గమనించి వాటర్‌ప్లాంట్ పని చేయకపోవడానికి గల కారణాలను సిబ్బందిని అడిగారు. ప్రత్యేకవిద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మధ్యాహ్న భోజనం అందించే వరకూ వేచిఉండి ఆహారపదార్థాలను రుచిచూశారు. అనంతరం వినియోగదారుల క్లబ్ ఏర్పాటుపై శిక్షణ పొందిన అధ్యాపకునితో చర్చించారు. తగిన సూచనలిచ్చారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం ఖాయమని విద్యార్థులకు సూచించారు. క్లాస్‌రూమ్‌లో డిజిటల్ సేవలను పరిశీలించారు. పరిజ్ఞానం పెంపొందేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని సూచించారు.

ధర్నాకు వెళ్లొద్దంటూ నోటీసులివ్వడం అన్యాయం

ప్రజాశక్తి - ఏలూరు

కౌలు రైతు సమస్యలపై లీడ్ బ్యాంకు ముందు ధర్నా చేయడానికి ప్రభుత్వం అనుమతి లేదంటూ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులకు పోలీసులు నోటీసులు ఇవ్వడం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఏలూరు జిల్లాలో కార్యక్రమం నిర్వహించకపోయినా పోలీసులు నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనం వద్ద కె.శ్రీనివాస్‌కు టూ టౌన్ పోలీసులు నోటీసు ఇచ్చారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై లీడ్ బ్యాంకు ముందు ఎలాంటి ఆందోళన చేపట్టకుండానే జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులకు పోలీసులు నోటీసులు ఇవ్వడం, కొన్నిచోట్ల బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఉంగుటూరు మండలం కైకరంలో కౌలు రైతుల సంఘం సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, భీమడోలు మండలం పూళ్లలో కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వి.శ్రీరామచంద్రమూర్తి తదితరులకు పోలీసులు నోటీసులిచ్చారని చెప్పారు. ఇటువంటి నిర్బంధ చర్యల వలన ప్రజా ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు.

ఉంగుటూరు : కౌలు రైతుల ధర్నాకు అనుమతి లేదనే పేరుతో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.అప్పారావుకు పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఖండించారు. సిఎం జగన్ ప్రభుత్వం కనీసం శాంతియుతంగా ధర్నాలకు, ఆందోళనలకు కూడా అనుమతించకపోవడం అన్యాయమన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు లావేటి సోంబాబు మాట్లాడుతూ కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలలనే ఉద్దేశంతో 660 జిఒను తీసుకొచ్చారని విమర్శించారు. ఈ జిఒను రద్దుచేసి నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ కులాలతో ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని. ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిశీలించి నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని, పంటల బీమా పథకానికి ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహశీల్దార్ సాయిరాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో వెలగలేటి మోహన్, కానూరు రాజు, నేతి దొరబాబు, దుత్తాడ వెంకన్న, బాపిరాజు, నరసింహమూర్తి, దండుపాటి రాంబాబు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

'కాయకల్ప' అవార్డుకు జంగారెడ్డిగూడెం ఆసుపత్రి ప్రతిపాదన

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వాసుపత్రులకు జాతీయ స్థాయిలో అందించే 'కాయకల్ప అవార్డు'కు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి పేరును ప్రతిపాదించామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ప్రయివేటు ఆసుపత్రులకు దీటుగా పూరి స్థాయిలో మౌలిక సదుపాయాలున్నాయని, ఈ ఆసుపత్రిలో పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రజలకు ఉత్తమ వైద్యసేవలందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో 'కాయకల్ప' అవార్డుకు రాష్ట్రం నుండి ఈ ఆసుపత్రి ని సిఫార్సు చేశామన్నారు. కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ స్లీవ జోజి, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాయలసీమ ప్రాంతంలో అభివృద్ధి చెందిన బిసి-ఎ కులాల్లో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం బుట్టాయగూడెం నెహ్రూ సెంటర్ వద్ద ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బిసి-ఎ సామాజిక తరగతిలో అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి కులాలవారు 2011 జనాభా లెక్కల ప్రకారం 40 లక్షల మంది ఉన్నారని, ప్రస్తుతం 70 లక్షలకుపైగా జనాభా ఉంటారన్నారు. ఆదివాసీల జీవన విధానం, సాంప్రదాయ పండుగల్లో జోక్యం లేని బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం ఈ రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్య అన్నారు. గతంలో నియమించిన ఏక సభ్య కమిషన్ శ్యామ్యూల్ ఆనంద్ కమిషన్ నివేదికను ఇప్పటికీ బహిర్గతం చేయలేదన్నారు. బోయవాల్మీకులను ఎస్‌టీ జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ, గిరిజన సంఘాలు వ్యక్తగత ఫిర్యాదులపై ఇంతవరకూ ప్రభుత్వం జవాబు ఇవ్వలేదన్నారు. ఏడు గిరిజన ఎంఎల్ఎ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించిన ఆదివాసీలకు అన్యాయం చేస్తూ ఓట్ల కోసమే రాయలసీమలో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్, నాయకులు నాగమణి, కె.పృధ్వీరాజు, కళ్యాణ్, శ్రీను, లలిత పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు రాజారామ్మోహన్‌రాయ్, భగత్‌సింగ్

ప్రజాశక్తి - ఏలూరు

సంఘసంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్, విప్లవ వీరుడు షహీద్ భగత్ సింగ్ ఆదర్శప్రాయులని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవత ఏలూరు అధ్యక్షులు ఎం.అజయ్‌బాబు అన్నారు. రాజా రామ్మోహన్ రాయ్ 190 వర్ధంతి, భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు పరిసర ప్రాంతాల్లోని విద్యాలయాల్లో పెద్దఎత్తున సభలు నిర్వహించారు. 30 హై స్కూళ్లు, పది కాలేజీల్లో జరిగిన ఈ సభల్లో ఆయా విద్యాలయాల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్, సెయింట్ థెరిస్సా హైస్కూల్లో జరిగిన సభలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ప్రధానవక్తక పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల, సిద్ధార్థ విద్యాలయాల్లో ఎం.రాజయ్య బాబు ప్రసంగించారు. బాలిక విద్య కోసం రాయ్ దేశంలో మొదటి బాలికల స్కూల్‌ని ప్రారంభిం చారన్నారు. సతీసహగమనానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించి సతీసహగమన నిషేధ చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. నేడు అబ్బాయిలతో పాటు అమ్మాయిలు కూడా చదువుకోగలిగే అవకాశం రావడానికి రాయ్ కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశం కోసం ఎన్నో స్వాతంత్ర్య పోరాటాలు ముందుండి నడిపించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో జి.శారద, ఎన్.గంగాభవాని, వై.అర్జున్‌రావు, సురేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : నేటి యువత భగత్ సింగ్ ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బి.యశ్వంత్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకురాలు, గాయత్రి ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కె.ఆశాలత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్, సుమన్, వంశీ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : రాజా రామ్మోహన్ రాయ్, భగత్ సింగ్ ఆశయ ఆశయ సాధన కోసం పనిచేయటమే వారికి మనమిచ్చే నివాళి అని కెపిడిటి స్కూల్ ప్రధానోపాధ్యాయులు విఎస్.ప్రేమ్‌చంద్, ఎవిఆర్.విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆదిశేషు అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని కెపిడిటీ స్కూల్ ఆవరణలో రాయ్ వర్ధంతి, భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, నాగ మునేశ్వరరావు, ఎస్.రామయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

6న రాజ్‌భవన్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాజ్‌భవన్ వద్ద వచ్చేనెల ఆరో తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి జె.గోపి పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, వీరి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని విమర్శించారు. ఆటో, ట్రాలీ, బస్సు, లారీ ఇలా అనేక రకాల వాహనాలను నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. రవాణారంగం ద్వారా దాదాపుగా కోట్లాది రూపాయల ఆదాయం ప్రభుత్వానికి చేరుతుందని తెలిపారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణారంగ కార్మికుల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారని, అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తానా అంటే తందానా అంటూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర, ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలకు ఆంధ్రప్రదేశ్ ప్రయోగశాలగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రవాణారంగ చట్ట సవరణ ఫలితంగా రాష్ట్రంలో వైసిపి సర్కారు జిఒ 21ని అమలు చేస్తోందని, దీనివల్ల ఫైన్లు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న రవాణారంగ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28, 29, 30 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ప్రచారయాత్ర నిర్వహిస్తున్నామని, వచ్చేనెల ఆరో తేదీన రాజ్‌భవన్ వద్ద ధర్నాలో రవాణారంగ కార్మికులందరూ పాల్గొని డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గౌడు రవీంద్రబాబు, బత్తిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రజకుల జిఒలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రజకుల సమస్యలపై అధికారులు దృష్టిసారించి వారికి కేటాయించిన జిఒలను అమలుచేస్తే చాలా సమస్యలు గ్రామ పంచాయతీల పరిధిలోనే పరిష్కారమవుతాయని రజక జనసంఘ జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. బుధవారం ఉంగుటూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలో జిల్లా రజక నేతలు పర్యటించారు. ఈ మేరకు స్థానిక రజక నేతలు పలు సమస్యలను జిల్లా రజక సంఘ నాయకులకు విన్నవించారు. చేబ్రోలు కార్యదర్శి బి.రవిచంద్రకుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. మండలంలోని అక్కుపల్లి గోకవరంలో ఎంతో కాలంగా వృత్తి చేసుకుని జీవిస్తున్న రజకుల చెరువు సమస్యను పరిష్కరించాలని కోరారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశాల ప్రకారం 2023 నుండి 2025 వరకూ మూడేళ్లకు రూ.7500 లీజును చెల్లించుకునే రసీదు ఇవ్వడం పట్ల రజకులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే చేబ్రోలు గ్రామంలో రజకులకు మోటారు బోరు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారని, గతంలో చేబ్రోలు రజకులు అడిగిన ప్రకారం ఉచిత కరెంటు ఇచ్చేందుకు గ్రామపంచాయతీ తీర్మానం చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అక్కుపల్లి గోకవరం గ్రామపంచాయతీ సర్పంచి మిద్దె సత్యవతి, నాయకులు మిద్దె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామంలోని చెరువును రజకులకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లా రజకజన సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య మాట్లాడుతూ రజకులు సంక్షేమం గురించి అధికారులు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కార్యదర్శి విఠల్ శ్రీనివాసు, కొమ్మంటి మురళీ, జువ్వలపాలెం సత్యనారాయణ, కడెల్లి సుబ్బయ్య, అక్కుపల్లి గ్రామ రజక సంఘం నాయకులు నిడమర్తి సూరయ్య, మాన్ రాజు నాగేంద్ర కుమార్, స్థానిక రజకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : మధు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని కె.జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు తెలిపారు. మండలంలోని కె.జగ్గవరంలో సంఘ ఆవరణలో మహా జనసభ ఛైర్ పర్సన్ మధు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఇటీవల మృతి చెందిన మాజీ అధ్యక్షులు వెలిది కృష్ణమూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మధు మాట్లాడుతూ సొసైటీ రూ.38 కోట్లు పరపతి వ్యాపారం, రూ.4 కోట్లు డిపాజిట్లు, పరపతేతర వ్యాపారంతో కలిపి రూ.75 కోట్ల వ్యాపారంతో దిన దినాభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. గుడ్లపల్లి గ్రామంలో దాతలు సహకారంతో 50సెంట్లు స్థలం సేకరించి రైతుల సౌకర్యం కోసం రూ.40 లక్షల అంచనా వ్యయంతో మల్టీ పర్సన్ గోడౌన్ నిర్మిస్తున్నామన్నారు. అల్లంచర్ల, రాజుపాలెం గ్రామంలో ఎరువుల గోడౌన్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సొసైటీ స్థలదాత స్వర్గీయ మాజీ అధ్యక్షులు వెలిది కృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని సంఘ ఆవరణలో ఏర్పాటు చేయాలని మహాజన సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. అనంతరం వార్షిక బడ్జెట్‌ను సిఇఒ తనగాల వీర వెంకయ్య ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో పర్సన్లు వంటి పల్లి వెంకటేశ్వరరావు, కొరప్రోలు రవిచంద్ర, శేఖర రెడ్డి, సర్పంచి తడికలపూడి శివమాధవి కిషోర్, ఎంపిటిసిలు బొడ్డపాటి రాంబాబు, పొదిల రామారావు, బంధంచర్ల సర్పంచి గుండె వెంకటేశ్వరరావు, రైతు భరోసా కేంద్రం ఛైర్మన్ బొందలపాటి సత్యనారాయణ, వెలిది రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మధు

ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పాశ్చానగరంలో పిడుగుపడి మృతి చెందిన ఇద్దరు మహిళల కుటుంబాలను టిడిపి నియోజకవర్గ యువనాయకులు సొంగా రోషన్ కుమార్, యాలలీలా ప్రశాంతి బుధవారం పరామర్శించారు. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోత్స్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని, జోత్స్న ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలు ఆమెకు కూడా వర్తించే విధంగా చొరవ చూపి ఆదుకోవాలని ఏలూరు సబ్ కలెక్టర్ జివి.సత్యనారాయణని ప్రత్యేకంగా కోరారు. మృత్యువాత పడిన ఇద్దరు మహిళల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.4 లక్షల విపత్తుల ఆర్థిక సహాయం కాకుండా, రూ.15 లక్షల ప్రభుత్వ సహాయం అందించాలని టిడిపి తరుపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు బోడ అనీష్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మృతి చెందిన మహిళా కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డి.సత్యనారాయణ, లింగపాలెం మండల అధ్యక్షుడు దాసు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా కూలీలపై పిడుగు పడి ఇద్దరు మరణించడం, ఒకరు తీవ్ర గాయాలు పాలవటం బాధాకరమైన విషయమని వారు విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని, గాయపడిన మహిళకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించి, కోరుకునే వరకు వారి కుటుంబ పోషణకు ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు.

పిడుగుపాటుకు గురైన మహిళల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం

ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ జివివి.సత్యనారాయణ

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్ట పరిహారమందించి ఆదుకుంటామని నూజివీడు ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ జివివి.సత్యనారాయణ తెలిపారు. లింగపాలెం మండలంలో మంగళవారం పిడుగుపాటుకు గురైన కుటుంబాలను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు బుధవారం ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ సత్యనారాయణ పరామర్శించారు. తీవ్ర గాయాలపాలై చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సొంగా జ్యోత్స్న ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. జ్యోత్స్నకు మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి అధికారులను సత్యనారాయణ ఆదేశించారు. పిడుగుపాటుకు గురై మరణించిన మృతదేహాలకు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న శవ పంచనామాను పరిశీలించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ జిఒ 15 ప్రకారం రూ.4 లక్షలు చొప్పున నష్టపరిహారం శవ పంచనామ నివేదిక అందిన వెంటనే, ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అంతేకాక ఆ కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకుంటామని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటిమెడికల్ దుర్గారావు, కాంతారావు, లింగపాలెం మండల పరిషత్ అధ్యక్షులు ముసునూరి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాలకవర్గానికి కృతజ్ఞతలు : జెఎసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి, వివిధ శాఖల్లో పనిచేస్తున్న 15 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రేగులరైజ్ చేసిన సిఎంకు, మంత్రి వర్గ ఉప సంఘానికి జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా సిపిఎస్ రద్దు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సహేతుకంగా లేదని, దీనిపై పునరాలోచించాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. జిపిఎస్ విధానం వలన సిపిఎస్ ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని వారు పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే ప్రకటించిన డిఎని దసరా కానుకగా ఇస్తామన్నారని, ఈనెలలో ఇస్తామని చెప్పిన సరెండర్ లీవ్స్, జిపిఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు, ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ మేక ప్రతాప్ అప్పారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చొరవతో నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం ఒకటి నుంచి ఐదు తరగతులతో ప్రారంభమవుతుందన్నారు. వచ్చే మార్చిలో ప్రవేశాలు ఉంటాయని ఆయన తెలిపారు.

షెడ్యూల్డ్ ప్రాంతంలో పీసా చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్రంలోని ఐదో షెడ్యూల్డు ప్రాంతంలో పీసా చట్టం అమలు కావడం లేదని, కేంద్ర ప్రభుత్వం కలుగ చేసుకుని పీసా నిబంధనలు అమలయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి వైస్ ఛైర్మన్, జిల్లా ఆదివాసి జెఎసి ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. బుట్టాయగూడెం సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఉపకారదర్శి విజయకుమార్‌ను కలిసి వినతిని సమర్పించారు. పీసాపై ఇప్పటికీ చాలామంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. గ్రామసభలో ప్రాముఖ్యత పీసాపై అవగాహన కల్పించాలని విజయ్‌కుమార్ సూచించారు.

'ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి'

ప్రజాశక్తి - ముసునూరు

మేరా భారత్-మేరా దేశం కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పివిఎస్ రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పిహెచ్‌సి వరకు మేరా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షకీల, వ్యాయామ ఉపాధ్యాయులు వాక నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మేరీ మట్టి, మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాధిక మాట్లాడుతూ దేశంలోని మట్టి ఎంతో విలువైందని, దాని విలువ రైతులకు మాత్రమే తెలుసన్నారు. దేశం గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని గురించి ఆమె వివరించారు.

ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టాలి : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు పైరును నష్టపరిచే ఎలుకల నివారణా చర్యలు చేపట్టాలని భీమడోలు జడ్‌పిటిసి సభ్యురాలు తుమ్మగుంట భవాని రంగా కోరారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌పిబి.ఉషారాణి ఆధ్వర్యంలో ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్‌పిటిసి పాల్గొనగా, అతిథిగా రైతు భరోసా కేంద్రాల మండల ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ పైరుకు నష్టం కలిగించడంతో పాటు, దిగుబడిపై ప్రభావం చూపించే ఎలుకల నివారణను సామూహికంగా చేపట్టి, మేలైన ఫలితాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రామలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

ఎలుకలు నివారణ మందు పంపిణీ చేస్తున్న భీమడోలు జడ్‌పిటిసి సభ్యురాలు

ముదినేపల్లి :మండలంలోని రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలనా చర్యలు చేపట్టాలని మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటలక్ష్మి కోరారు. మండలంలోని దాకరం గ్రామంలో బుధవారం మండల స్థాయి సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టడానికి ప్రభుత్వం 100 శాతం రాయితీతో బ్రోమోడయోలోన్ మందును సరఫరా చేసిందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారి పొలాల్లో ఎలుక బొరియలను గుర్తించి, మందు పెట్టి ఎలుకలను నియంత్రణ చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు. మండల వ్యవసాయ అధికారి బొర్రా వేణుమాధవ్ మాట్లాడుతూ మండలం మొత్తం మీద 97 కేజీల బ్రోమోడైలోన్ మందును సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దాకరం గ్రామ రైతులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

నల్లచెరువులో అర్థనగ్నంగా నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా బుధవారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షలో రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, గద్దల సుహాసిని, గద్దల మోహన్ రావు, గూడపాటి అజయ్, లక్కపాము కాంతారావు, పిన్నిబోయిన మంగయ్య, గద్దె రఘుబాబు, గార్లపాటి నరసింహారావు, టిడిపి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మా నాయకుడు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రాణ త్యాగాలు చేయటానికైనా సిద్ధమేనంటూ జలదీక్షలో పాల్గొన్న ముద్దరబోయిన, టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం మండలంలోని గుడిపాడు గ్రామంలోని నల్ల చెరువులో అర్ధనగ్న ప్రదర్శనతో జల దీక్షలో నిర్వహించారు. ఈ దీక్షలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మెదరమెట్ల సురేంద్ర, మందలపు ధర్మరాజు, లక్కపాము కాంతారావు, కందుల పిచ్చయ్య, మసిమూకు సుబ్బారావు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జార్జి ఇన్‌స్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఉద్యోగాల పేరుతో గిరిజన యువకులను మోసం చేస్తున్న ది జార్జి ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ మేనేజర్ సిద్ధార్థ దేవరపల్లి, సంస్థ సూపర్‌వైజర్ కొమరం దుర్గమ్మపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. పాత విజయ బ్యాంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ది జార్జ్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ కన్నాపురం సంస్థలో ఉద్యోగాలు కోల్పోయిన నిరుద్యోగ యువకులతో రిలే దీక్ష, నిరసన కార్యక్రమం గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సంస్థ నుంచి తీసివేసిన వాళ్లని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, గిరిజన యువకులపై సంస్థ ఆధిపతుల వేధింపులు ఆపాలని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం సంవత్సరం పాటు విధుల్లో కొనసాగించాలన్నారు. గిరిజన మహిళైన కొమరం దుర్గమ్మ ఉద్యోగుల పట్ల అసభ్య పాదజాలంతో మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆమెను విధుల నుంచి తొలగించాలని కోరారు. గిరిజన యువకులను ఉద్యోగాల పేరుతో మోసం చేసి అసభ్యంగా ప్రవర్తించిన సంస్థ పైన, సంస్థ యజమానులపైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. గిరిజన యువకులకు తక్షణమే న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ధర్నాను ఉద్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, సిఐటియు నాయకురాలు మొడియం నాగమణి, గిరిజన యువకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని ఎ.పోలవరం, నాగులగూడెం, పట్టిన పాలెం గ్రామాల ఉపాధి కూలీలకు ప్లేసిప్పులు ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతిని అందించారు. అనంతరం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎం.జీవరత్నం మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని కోరుతున్న కూలీలపై మండల ఎపిఒ దుర్భాషలాడటం, జాబు కార్డు రద్దు చేస్తామని బెదిరించడం చేశారని తెలిపారు. అందువల్ల ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మండల అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జోడే సూర్యచంద్రరావు, ఎం.ఆనందరావు, కె.సుబ్బారావు, వి.నరసరావు పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జి నిర్మాణాల కోసం భూ సర్వే

రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడి రైల్వే గేట్లు ప్రాంతంలో ఓవర్ బ్రిడ్జి వంతెన నిర్మాణాల కోసం భూసర్వే బుధవారం నిర్వహించారు. సాధ్యఅసాధ్యాలు, భూమి లభ్యత, ఎలైన్‌మెంట్ నమూనాకు రైల్వే, ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కైకరంలో రైల్వే గేటుకు రెండు పక్కల నుంచి వెయ్యి మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు వరకూ భూసేకరణ చేయాల్సి ఉంది. అందులో ప్రభుత్వ స్థలం ఎంత వరకు ఉందో సర్వే చేసి వాటి వివరాలను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని అధికారులు తెలిపారు. కైకరం భూసేకరణలకు ఇబ్బందులు లేనట్లు అధికారులు చెబుతున్నారు. చేబ్రోలు, ఉంగుటూరుల్లోనే భూసమస్య ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈరెండు గేట్లు వద్ద 500 మీటర్ల పొడువైన భూమి కావాల్సి వస్తే అందులో జాతీయ రహదారి భూములతో పాటు, ప్రైయివేటు స్థలాలు కూడా పెద్ద సంఖ్యలో సేకరించి, పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. చేబ్రోలులో రైల్వే స్టేషన్ పక్కన నుంచి ఓవర్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌కు అవకాశం ఉన్నట్లు సమాచారం. ఉంగుటూరులో పెద్ద సంఖ్యలో ప్రైయివేటు ఇళ్లు, కట్టడాలు పోకుండా కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు రైల్వే గేట్లకు ఇరు పక్కలా ల్యాండ్ ఇన్‌స్పెక్షన్ చేశామని భీమడోలు సెక్షన్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు జె.భాస్కరరావు ప్రజాశక్తికి వెల్లడించారు.

నాయకులను విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

30న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఏలూరు

అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లెనిన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 26వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిందన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సిగ్గు చేటన్నారు. హాస్టళ్లల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అలాగే నూతన విద్యా విధానం రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న అమ్మఒడి అందజేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ స్థాయిలో డిగ్రీ కాలేజీ, జిల్లాస్థాయిలో పిజి కాలేజ్ ఏర్పాటు చేయాలని, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా నంద్యాల, విజయనగరం, కడప జిల్లాలో నాయకులను ముందస్తు అరెస్టులు చేసి, కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల ఆనుకున్నారు, రౌడీషీటర్లు ఆనుకున్నారా, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మాట్లాడే స్వేచ్ఛ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. వెంటనే అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం ఉందని, ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంశీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇండియన్ స్వచ్ఛత లీగ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ 'స్వచ్ఛత లీగ్' నిర్వహించారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కలిపిస్తూ స్వచ్ఛత ప్రతిజ్ఞ, పారిశుధ్య కార్మికులను ఈదర సుబ్బమ్మదేవి స్కూల్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ పర్యావరణ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండిలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - కలిదిండి

వినాయక చవితి ముగింపును పురస్కరించుకుని ఆరు వేల మందికిపైగా భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నట్లు శ్రీవరసిద్ధి వినాయక కమిటీ బృందం తెలిపింది. బుధవారం నిర్వహించిన అన్నసమారాధనలో ఎంపిపి నీలి సుమన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ బొర్రా రామకృష్ణ, బి.గోవిందు, మేకా భోగేశ్వరరావు, మసిముక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఫ్రిజ్ వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాగుపాడు పిహెచ్‌సికి దొంతవరం సర్పంచి కంభంపాటి సత్యవతి, ఆమె భర్త వైసిపి నాయకులు సూరిబాబు ఫ్రిజ్ వితరణ చేశారు. సూరిబాబు తల్లిదండ్రులు కంభంపాటి రామారావు, సరస్వతి జ్ఞాపకార్థం ఈ ఫ్రిజ్ బహూకరణ చేసినట్లు బుధవారం తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల అవసరార్థం ఈ ఫ్రిజ్‌ను వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దాతలను ఆసుపత్రి వైద్య సిబ్బంది అభినందించారు.

'అంజనాదేవి సేవలు మరువలేనివి'

ప్రజాశక్తి - ముసునూరు

అంగన్‌వాడీ కార్యకర్తగా 33 సంవత్సరాలు పనిచేసిన ఎస్.అంజనాదేవి సేవలు మరువలేనివని సెక్టార్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి కొనియాడారు. బుధవారం మండలంలోని గుళ్లపూడి గ్రామంలో కేడు సెంటర్ 126లో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న అంజనాదేవి ఉద్యోగ పదవీ విరమణ చేస్తున్న శుభ సందర్భంగా భార్యాభర్తలు ఇరువురును అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

శ్రీవారి ఆలయంలో పలు టెండర్లు ఆమోదం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమలలో 25వ తేదీన ఛైర్మన్ ఎస్‌వి సుధాకరరావు అధ్యక్షతన నిర్వహించిన ట్రస్టు బోర్డు సమావేశంలో వివిధ అంశాలు చర్చించి, ఆమోదించారని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు ప్రతికా ప్రకటనలో తెలిపారు. తలనీలాలు పోగుచేసుకొను హక్కుకు హెచ్చుపాట, వివిధ షాపులకు సంబంధించిన లైసెన్స్ హక్కులు, మైలవరం షాపుల లైసెన్స్ హక్కులు, హెచ్చుపాట దారులను ఆమోదించినట్లు తెలిపారు. స్వామి వారి ఆశ్వయుజ కళ్యాణ మహోత్సవాలకు సంబంధించిన వివిధ టెండర్లు ఆమోదించినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు.

నేడు భైరవపట్నంలో జన సైనికుల సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నాల్గవ విడత వారాహి యాత్ర కైకలూరు నియోజకవర్గ విచ్చేస్తున్న సందర్భంగా ఈనెల 27న సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల గౌరవ అధ్యక్షులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణ జిల్లా జనసేన అధ్యక్షులు బండిరెడ్డి రామకృష్ణ కైకలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బి.వి.రావు ఆధ్వర్యంలో భైరవపట్నం గ్రామంలోని ఓ కళ్యాణ మండపంలో వారాహి యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారాహి యాత్ర సమీక్ష సమావేశమునకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి జన సైనికులు, వీర మహిళలు హాజరు కావాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ ఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని చినకొమ్ములూరులో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కొమర్రు పంచాయతీ, శివారు చినకొమ్ములూరుకు చెందిన తేలు సాయి(26) అనే యువకుడు కొరియర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 7 గంటల సమయంలో పశువులకు మేత కోసుకొచ్చే నిమిత్తం సమీపంలో ఉన్న చేపల చెరువు గట్టు పైకి వెళ్లాడు. పచ్చగడ్డి కోస్తుండగా కట్ట విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు 108 వాహనమునకు సమాచారం అందించగా, వారు వచ్చి పరీక్షించి అప్పటికే సాయి మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి కూనపరెడ్డి శ్రీసాయి కృష్ణ, గ్రామ ప్రముఖులు కె.గంగారాధాకృష్ణ మృతదేహాన్ని సందర్శించి, అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

నూజివీడు రూరల్: మండలంలోని లైనేతండా గ్రామంలో తల్లి మందలించిందని కుమార్తె చీమల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమారి(17)కి తల్లితో చిన్న విషయంపై గొడవ జరిగింది. దీంతో తల్లి కుమార్తెను మందలించగా, మనస్తాపానికి గురైన కుమారి చీమల మందు తిని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించిన వైద్యులు పరీక్షించి ప్రాణాపాయం లేదని వివరించారు. ప్రస్తుతం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నూజివీడు రూరల్: చెల్లని చెక్కు కేసులో ఆత్తులూరి ప్రసాద్ అనే వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.15 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు పట్టణానికి చెందిన ఆత్తులూరి ప్రసాద్, సూర్య పల్లికి చెందిన వడపల్లి శివరాం వద్ద 2018 ఆగస్టులో రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం బాకీ చెల్లించమని శివరాం పలుమార్లు కోరగా 2019 అక్టోబర్‌లో రూ.5 లక్షల చొప్పున రెండు చెక్కులు ఇచ్చాడు. వాటిని నగదుగా మార్చుకునేందుకు బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేదని బ్యాంకు వారు చెక్కును తిప్పి పంపారు. బ్యాంకు వారు చెల్లని చెక్కు జమ చేసినందుకు పెనాల్టీ కూడా విధించారు. దీంతో శివరాం కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం ప్రాసిక్యూషన్ న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ప్రజాశక్తి
ప్రతిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి : వ్యకాస

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో అక్టోబర్‌లో ఏలూరులో నిర్వహించే భూమి కోసం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో రాష్ట్ర సదసును జయప్రదం చేయాల్సిందిగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాకిరి శివనాగరాజు, రాజులపాటి చంటి, ముత్యాల నరేష్‌లు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన దర్బార్ సందర్భంగా ఐటిడిఎ కెఆర్ పురంలో పోలవరం నిర్వాశితుల సమస్యలను గూర్చి ఆప్తమిత్ర సేవ సంస్థ డైరెక్టర్ ముశ్చిక రంజిత్ కుమార్ దొర ఐటిడిఎ ఎఒ రామారావుకి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన ముంపునకు గురవుతున్న 2015 - 16 సంవత్సరాలలో కాళీ చేసిన మొదటి విడత నిర్వాసిత గ్రామాలలో ఈనాటికి కొంతమంది నిర్వాసితులకు ప్రభుత్వ రాయితీలను, మౌలి సదుపాయాలను పూర్తి చేయలేదన్నారు. కాబట్టి నిర్వాశితులకు రావాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీలను, మౌలిక సదుపాయాలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు యనమదల హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని యనమదల జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల బుధవారం పలువురు అభినందించారు. సాఫ్ట్‌బాల్ సీనియర్ విభాగంలో సి హెచ్.సుశాంత్, బేస్‌బాల్ విభాగంలో ఎం.మున్నా, జూనియర్ విభాగంలో సాఫ్ట్ బాల్‌లో ఎం.ప్రఖ్యాత్, బేస్‌బాల్‌లో సి హెచ్.శరణకుమార్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. హైస్కూల్ హెచ్ఎం ఎంఎస్.నాగరాజు, పిడి టివి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కేతవరం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కేతవరం విద్యార్థిని కాసగాని మౌనిక ఎంపికైనట్లు హెచ్ఎం బి.కృష్ణ తెలిపారు. కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన ఎస్‌సిహెచ్‌బిఆర్ఎం ఉన్నత పాఠశాల భీమవరంలో నిర్వహించిన యోగాసన పోటీలలో బాలికల అండర్-14 విభాగంలో కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాసగాని మౌనిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.రమేష్, యోగా ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు** బ్రాంచి వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **శ్రీమతి ముత్యాల తులసి** భర్త : ముత్యాల శ్రీనివాసరావు, వయస్సు : 44 సం॥, నివాసం : ఊటసముద్రం గ్రామం, చింతలపూడి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి సబ్‌డివిజన్‌లో చేరిన చింతలపూడి మండలం, ఊటసముద్రం పంచాయితీలోని ఊటసముద్రం గ్రామం తాలూకా జిరాయితి మెరక ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి నా భర్తగారు పూర్విర్తం బాపతు ఆస్తి అయి వుండి అనగా లోగడ నా భర్తగారు కాకాని రాజు గారి మరణాంతరం శ్రీ ప్రభుత్వం వారిచే నా పేర ఇ. 267718 (పట్టా నెం. 18) రు గా నాపేర పట్టాదారు పాసు పుస్తకం భూమి యాజమాన్యపు హక్కు పత్రము మంజూరు కాబడి గ్రామ రెవిన్యూ లెక్కలో నా పేర 1బి అడంగల్ ఆన్‌లైన్ కాబడి తదాది నేటి వరకు నా సంపూర్ణ స్వాదీన అనుభవ హక్కు భుక్తములో గల జిరాయితీ మెరక రి.నెం. 127-8 రు దాఖలా, **డాక్యుమెంట్ నెం. 6071/2019** నాకు గల య. 1-02 ట్లలలో ఉత్తరం వైపున నీకు శెటిల్‌మెంట చేసిన చ॥గ॥ 242లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : కాకాని జగపతి గారి భూమి, **పడమర** : సంగసాని తిరుపయ్య గారి స్థలం, **దక్షిణము** : కాకాని రాజు వగైరాల భూమి, **ఉత్తరం** : జిల్లా పరిషత్ రోడ్డు మార్జిన్

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం,సెల్ : 9849246278

ప్రకటన

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, చినఅమిరం గ్రామం, రమణ కుంజ అపార్ట్‌మెంట్, సెకండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.102రు, కాపురస్తులు అల్లూరు సత్య కిషోర్ వర్మ గారి భార్య అల్లూరు రంగావతి, వయస్సు 46 సం॥లు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

నా క్లయింటు అయిన అల్లూరు సత్య కిషోర్ వర్మ గారి భార్య అల్లూరు రంగావతి గారికి డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పట్టణంలో ఖాళీ స్థలంలో బిల్డింగ్ కలదు. సదరు ఆస్తికి సంబంధించిన 1) ది.10-09-1979 సం॥ తేదీ నాటి ద.నెం. 3802/1979రు మరియు 2) ది.23-09-1980 సం॥తేదీనాటి ద.నెం.4411/1980రు గల రెండు ఒరిజినల్ లింకు దాస్తావేజులను నా క్లయింటు ది.18-09-2023 సం॥తేదీన ఒక కవరులో పెట్టుకొని చినఅమిరంలో ఆటో ఎక్కి భీమవరం జువ్వలపాలెం రోడ్డుకి వస్తుండగా మార్గమధ్యములో భీమవరం రెండవ పట్టణ పరిధిలో సదరు దస్తావేజులు పెట్టిన కవరు జారి పడిపోయినది. నా క్లయింటు పైన తెలియపర్చిన రెండు ఒరిజినల్ లింకు దస్తావేజులను పోగొట్టుకొనియున్నారు. నా క్లయింటు మరలా మార్గమధ్యములోనూ పరిసర ప్రాంతాలలో వెతికినారు దొరకలేదు. ఎవ్వరికైనా దొరికిన యెడల మా క్లయింటు అయిన అల్లూరు రంగావతి గారి అడ్రస్‌కు గాని వారి సెల్ నెం.**99494 00966**రు కు గాని తెలియపర్చగలరు.

బొక్కా చంద్రశేఖర రావు
అడ్వకేట్ & నోటరీ
తాలూకా ఆఫీసు ఏదురుగా,
భీమవరం-534 201, ప॥గో॥జిల్లా.
సెల్ : 94911 72663

ప్రాంతం : భీమవరం
తేది : 27.09.2023